# మదర్

డా॥ గాయత్రీదేవి

**“డాక్టర్, మా అమ్మ ఆరోగ్యం గురించి మా ఇంట్లో ఎవ్వరికీ పట్టడం లేదండీ. నాకు ఒక్కడికీ వండిపెట్టడం అయితే అమ్మకి ఇంత శ్రమ ఉండేది కాదు. మా అన్నయ్యకి పెళ్లయిననాటినుండి మా అమ్మకి పని చాలా ఎక్కువైపోయింది...**

మా వదిన ఒక్క పనికూడా ముట్టుకోదు. ఉదయం ఎనిమిది గంటలకి అన్నయ్య పిల్లలిద్దరికీ టిఫిన్ చేసి, వాళ్లనోటికి అందించి, వాళ్లకి టిఫిన్ కారేజీలు సర్ది, ఇద్దర్నీ చెరోచేత్తో పట్టుకుని, మా రోడ్డు చివరికి తీసికెళ్లి స్కూలు బస్సు ఎక్కించి వస్తుంది. తొమ్మిది గంటలకి మా అన్నయ్య వదినలకి వడ్డించి వాళ్లకి క్యారేజీలు సర్దిపంపుతుంది. పన్నెండు గంటలకి రెండోపిల్ల స్కూలుకెళ్లి దాన్ని తీసుకొస్తుంది. మళ్లీ దాని భోజనం. చిన్న పిల్లలకి అన్నం పెట్టడానికి ఎంత ఓపిక ఉండాలో మీకు తెలియనిది కాదు. నాలుగవుతూంటే పెద్దపిల్ల వస్తుంది. మళ్లీ దానికి ప్రత్యేకంగా టిఫిన్ సిద్ధం చేస్తుంది.


ఆరుగంటలకి అన్నయ్య వదినలు వచ్చేసరికి వేడివేడిగా కాఫీ, మళ్లీ టిఫిన్ అందించాలి. సాయంకాలం అందరికి వంట చేసి ఎనిమిదిగంటలకల్లా వడ్డించాలి. భోజనం చేసి ఎవరికి వారు లేచి వెళ్లిపోతారు. మా వదిన కనీసం ఆ పనయినా చెయ్యదు. రాత్రి పదకుండు గంటలయితే కానీ ఆవిడకి నడ్డి వాల్చే అవకాశం రాదు. అరవైఏళ్లు దాటాయి. ఇంత శ్రమ పడే వయసా ఆవిడది? యంత్రంలా పనిచేస్తోంది. అమ్మ లేవలేకపోతే ఇంట్లో ఎంత ఇబ్బందో, అమ్మకి కాలునొప్పి త్వరగా తగ్గి లేచి పనిచేసుకోగలిగేలా మంచి మందు ఇవ్వండి... ప్లీజ్...” అంటూ ఊపిరి తీసుకోకుండా గడగడా చెప్పాడు సత్యవతమ్మగారి రెండో అబ్బాయి.

సత్యవతమ్మగారి కుటుంబంతో నాకు డాక్టర్‌గానే కాక వ్యక్తిగతంగా బాగా పరిచయం ఉంది. ఆ కుటుంబ సభ్యులు అనారోగ్యాల గురించే కాక ఆంతరంగిక విషయాలుకూడా నాతో చర్చిస్తూ ఉంటారు.

“ప్రస్తుతానికి ఒక టాబ్లెట్ ఇస్తున్నాను. వెయ్యండి. మధ్యాహ్నం నేను ఇంటికి వచ్చి పరీక్షచేసి చూసి మందులిస్తాను” అని చెప్పి అతన్ని పంపాను.

అతను వెళ్లిన అయిదు నిమిషాలకే సత్యవతమ్మగారి పెద్దకొడుకు కోడలు వచ్చారు.

“మా అత్తగారిని ఇన్నేళ్లనుండీ చూస్తున్నారు కదా! ఏనాడయినా ఆవిడ మంచంమీద పడుకోవడం చూశారా డాక్టర్? ఈ రోజు ఆవిడ కాలు వాచిపోయి లేవలేని స్థితిలో ఉన్నారు. ఒక్కక్షణం కూడా ఖాళీగా కూర్చోవడం అలవాటు లేని మనిషిని అలా చూడ్డానికి ఎంతో కష్టంగా ఉందండీ. ఆవిడకి చాకిరీ ఎక్కువయిపోయిందండీ- మా ఆడపడుచు ఉద్యోగం చేస్తోంది కదా, ఆవిడ- పిల్లకి మూడు నెలలు వచ్చినప్పట్నుంచీ, మా ఇంటికి తీసుకొచ్చి, మా అత్తగారి దగ్గర వదిలి వెళ్తోంది. చంటిపిల్లని చూడడం అంటే మాటలా చెప్పండి. వయసులో ఉన్నవాళ్లే చంటిపిల్లల్ని చూసుకోడానికి ఓపిక చాలక యాతన పడతారు. అటువంటిది అరవైఏళ్ల ముసలావిడ, ఆవిడకి ఓపిక ఎక్కడుంటుంది. మా ఆడపడుచుకి ఆ బెంగేలేదు. దర్జాగా గేటు దగ్గర్నుంచి, అమ్మా అని కేకేసి, ఆయా చేతికి అందించినట్లు చంటిపిల్లని అందించి వెళ్లిపోతుంది.



“ఆ పసిపిల్లకి స్నానం చేయించి, కాకులూ పిల్లులూ చూపించి గోరుముద్దలు తినిపించడం, దాన్ని జోకొట్టడం, మలమూత్రాలు ఎత్తి శుభ్రం చెయ్యడం ఇలా రోజంతా దాని చాకిరీయే సరిపోతుంది.

“మా అత్తగారికి మేము ఎన్నిసార్లు చెప్పి చూశాం. ‘మీకెందుకీ భారం, చూడనని చెప్పేయండి. వాళ్ల పిల్లని వాళ్లే చూసుకుంటారు. తను ఉద్యోగం చేసి సంపాదించిన డబ్బు, ఒక్కనాడయినా మీ చేతిలో పెడుతుందా ఏమయినానా? మీ మనవరాలిని చైల్డ్ కేర్ సెంటర్‌లో చేర్పించమని చెప్పండి’, అని ఎన్నిసార్లు చెప్పినా, ‘చంటిపిల్లని ఎవ్వరూ లేనట్లు ఎక్కడో వదలడం ఏమిటమ్మా, నాకు నా మనుమరాలు భారమా? చంటిపిల్ల ఆటపాటలు చూస్తూంటే ఎంతో ఆనందంగా ఉంటుంది’ అంటారే తప్ప, ఆపని మానరు. అంతంత శ్రమపడడం వల్లనే ఆవిడ ఆరోగ్యం దెబ్బతింది. ఈరోజు ఆవిడ లేవలేకపోతే కూతురొచ్చి చూస్తోందా... మేమే కదా యాతనలు పడుతున్నాం. ఇవేవీ ఆవిడకీ, మా ఆడపడుచుకీ పట్టవు. మీరు మా అత్తగారికి కాలినెప్పి త్వరగా తగ్గేలా మందివ్వండి ప్లీజ్” అంది సత్యవతమ్మగారి కోడలు.

“మీ మరిది వచ్చి వెళ్లాడు. అతని చేతికి టాబ్లెట్ ఇచ్చి పంపాను. మధ్యాహ్నం నేను వచ్చి పరీక్షచేసి చూసి సరయిన మందులు రాసిస్తాను” అన్నాను.

“ఓహో అతను వచ్చి వెళ్లాడా?... అవును మరి అతనికి వేళకి భోజనం, టిఫిన్ అందవు కదా. మీరే చెప్పండి డాక్టర్, వాళ్ల ఆఫీసులో మంచి లౌంజ్ ఉంది. అక్కడ టిఫిన్, భోజనం అన్నీ దొరుకుతాయి. అతగాడి కోసం మా అత్తగారు నాలుగ్గంటలకే మేలుకోవలసి వస్తోంది. తెల్లవారు ఝామునే లేచి, తల్లిని చేసిపెట్టమనకపోతే, తను ఆఫీసులో తిని, తల్లిని సుఖపెట్టకూడదూ...” అంటూ వెళ్లింది ఆవిడ.

మరికొంతసేపట్లోనే సత్యవతమ్మగారి కూతురూ, అల్లుడూ వచ్చారు. చిన్నప్పట్నుంచీ నాతో కలిసి చదువుకున్న ఆ అమ్మాయి-

“హల్లో బావున్నావా? మా అమ్మని చిన్నప్పట్నుంచీ చూస్తున్నావుకదు- ఆవిడకి ఏనాడూ జలుబూ, జ్వరంకూడా ఎరగం! అలాంటి అమ్మ ఈరోజు లేవలేదు. ఎందుకో తెలుసా- ఆవిడ మోకాలు ఎర్రగా వాచిపోయి ఉంది. అంత ఆరోగ్యంగా ఉండే మనిషికి, హఠాత్తుగా ఎందుకిలా అయ్యిందో ఊహించగలవా. తెల్లవారు ఘామున నాలుగు గంటలకి లేచి రాత్రి పదకొండుగంటల దాకా, నిర్విరామంగా చాకిరీ చేయడం వల్లనే ఇలా అయింది. మా అమ్మ ఏ జన్మలో ఏ పాపం చేసిందో ఇటువంటి కోడలు దొరికింది. ఆవిడగారు ఒక్కపూట వంట చేయ్యడం చూడలేదు నేను. ఎంతసేపూ తన ఉద్యోగం, తన ప్రమోషన్ల గురించే తప్ప, అమ్మని కష్ట పెడుతున్నాననే ఆలోచనే లేదు. ఆవిడగారికీ, ఆవిడ పిల్లలకీ టైముకి ఠంచనుగా కాఫీ, టిఫిన్లు, భోజనాలు- అందించడమే సరిపోతోంది అమ్మకి. ఎంత చాకిరీ చేస్తే మాత్రం ఏం ప్రయోజనం- అత్తగారి సాయం వల్లనే ఉద్యోగం చేసుకుంటున్నానని

తన సంపాదన మా అమ్మ చేతిలో పెడుతుందా.. లేదే... అమ్మని ఓ పనిమనిషిలా, వంటమనిషిలా చూస్తుంది. అమ్మా, నీకెందుకీ చాకిరీ నీ ఆరోగ్యం పాడవుతుంది, హాయిగా విశ్రాంతిగా ఉండచ్చుకదా అంటే వినదు. 'కోడలు మాత్రం ఖాళీగా కూర్చుంటుందా సంసారంకోసం వీధిలోకి వెళ్లి ఉదయం నుండీ సాయంత్రం వరకూ కష్టపడి వస్తోంది కదా! ఈ రోజుల్లో ఇద్దరూ సంపాదించకపోతే గడుస్తుందామ్మా?' అంటుంది.

"ఇంత చాకిరీ చేసే మనిషి మంచాన పడితే మాత్రం, వాళ్లకేమయినా బెంగా, కన్నకూతుర్ని కనక నా మనసుకి కష్టంగా ఉంది. అమ్మ లేచి తిరిగేలా నువ్వు మంచి మందు ఇవ్వాలి. అమ్మ ఎత్తుకోకపోతే చంటిపిల్లకి తోచడం లేదు..."

"మీ చిన్నన్నయ్యకి మాత్ర ఇచ్చాను. నేను ఇంటికి వెళ్లి చూస్తాలే" అని చెప్పి పంపాను.

ooo ooo ooo

సత్యవతమ్మగారి ఇంటికి వెళ్లేసరికి ఆవిడ మంచంమీద పడుకుని కళ్లు మూసుకుని రామనామం జపించుకుంటున్నారు. దగ్గరగా వెళ్లి పలకరించాను. మోకాలు పరీక్షించి చూశాను. వాపు చాలా ఎక్కువగా ఉంది. సాధారణంగా ఆ వాపు ఉంటే, సూదులతో పొడి చేస్తున్నట్టు విపరీతమైన నెప్పి ఉంటుంది. ఆవిడకీ ఉండే ఉంటుంది. సత్యవతమ్మగారి మొహంలో ఆ బాధ కనబడడంలేదు. ఆవిడ మనసు నెప్పిని పట్టించుకుంటున్నట్లు లేదు. అలా ఉండగలడం యోగులకే సాధ్యం. ఆవిడ నిజమైన కర్మయోగి అనుకున్నాను.

"నెప్పి ఎక్కువగా ఉందా?" అన్నాను.

"చాలా ఎక్కువగా ఉంది. నేను మూలిగితే పిల్లలు కంగారు పడతారు. కాలు కదపనివ్వడం లేదు. ఈ మంచం ఒక ఖైదులా, నేనో ఖైదీలా తోస్తోంది. పిచ్చెక్కినట్లుంది. ఇంట్లో అందరికీ యాతనైపోతోంది. నేను త్వరగా లేచి పనులు చేసుకోవాలి. "

"ఇంట్లో ఎవరూ లేనట్లున్నారే?"

"ఆఫీసుకి సెలవులు దొరకవు కదమ్మా. చిన్నవాడు పాపం ఇవాళ్టికి ఆఫీసులోనే భోంచేస్తాలేమ్మా అని వెళ్లాడు. వాడికి ఇంటి దగ్గర నేను పెడితే కానీ తిన్నట్లుండదు. సరిగ్గా తిన్నాడో లేదో ఈ పూట! పెద్దకొడుకు హోటల్‌నుండి కేరేజీ తెచ్చాడు. పిల్లలక్కూడా ఈ పూట హోటల్ భోజనం తప్పలేదు. హోటళ్లల్లో శుభ్రంగా వండరు కదా. పిల్లలకి ఏ అజీర్ణమయినా చేస్తుందేమోనని ప్రాణం గిలగిలలాడుతోంది."

"మీరు భోంచేశారా?"

"....."

"మీ అమ్మాయి రాలేదా?"

"వచ్చి వెళ్లింది. ఈపూట చంటిపిల్లని ఎక్కడా వదలడానికి లేక ఆఫీసుకి సెలవు పెట్టింది. పాపం దానికీ ఇబ్బందే అయ్యింది నా కాలివల్ల".

"ఆఫీసుకి సెలవు పెడితే ఇంట్లో కనబడదేం...?"

"చాలాకాలంగా షాపింగ్ పనులేవో మిగిలిపోయాయిట. ఎలాగూ సెలవు పెట్టింది కదా పూర్తి చేసుకుంటానని వెళ్లింది"

"మామయ్యగారు...?"

"ఆయనకి కాఫీ వేళయ్యింది... హోటల్లో తాగి వస్తానని ఇపుడే వెళ్లారు. నువ్వు ఏం మందిస్తావో, నాకు వెంటనే తగ్గేలా చూడు. వీళ్లంతా ఇలా యాతన పడుతూంటే చూడలేకపోతున్నాను"

అంతలోనే ఆవిడ భర్త వచ్చారు.

"ఏమ్మా, బావున్నావా? ఇది ఏనాడైనా మంచంఎక్కడం చేశావా? నాకు అస్సలు మనస్థిమితం లేదనుకో. గొడ్డులా చాకిరీ చేస్తోంది తన పిల్లలకోసం, మనవలకోసం. ఒక్కరంటే ఒక్కరు సెలవు పెట్టి దాని దగ్గర కూర్చోలేదు. ఎవరికి వాళ్లు వెళ్లిపోయారు.

"నాకు పెన్షన్ వస్తోంది. ఈ ఇల్లు నా స్వార్జితం. మాకు ఎవ్వరూ ఒక్క పైసా పెట్టక్కరలేదు. వాళ్ల బతుకులు వాళ్లని బతకమందాం. మనమిద్దరంసుఖంగా ఉండచ్చు అంటే వినదు. ఈ వయసులో ఇంత చాకిరీ చేసే శక్తి ఉంటుందా? ఇవాళ చూడు నా మొహాన కాఫీనీళ్లు కూడా పొయ్యలేదు ఎవ్వరూ. రేపొద్దున్న దానికేమయినా వస్తే వీళ్లెవ్వరూ చూడరు. చెపితే వినడం లేదీవిడ."

ఆయన మాటలు విని, ఆవిడవైపు తిరిగాను. శ్రీకృష్ణపరమాత్మలా చిరునవ్వులు చిందిస్తోంది. శరీరంలో అంతటి బాధ ఉండగా ఆవిడ నవ్వగలగడం...

"ఆయన ఎపుడూ అలాగే అంటారు. ఎవరికి మాత్రం నిర్వ్యాపారంగా కాలం గుడుస్తుంది చెప్పు. కోడలు ఉద్యోగానికి వెళ్తోంది. అది మాత్రం చాకిరీ కాదూ... ఆ చాకిరీతోపాటు ఇంటిపని చెయ్యడానికి, మా అమ్మాయి ఉద్యోగానికి వెళ్తూంటే నేను పిల్లని చూడననడానికీ నేను రాక్షసినా? నేనేమీ పరాయి వాళ్లకోసం చెయ్యడం లేదే... నా పిల్లలకోసమే కదా... ఇంతకీ నేనేం కష్టపడుతున్నానని... పరమాత్ముడు నాకు శక్తి ఇచ్చినన్నాళ్లు చేస్తాను. శక్తి ఇమ్మని ప్రార్థిస్తాను. శక్తి ఉడిగిననాడు నన్నీలోకంలో ఉంచవద్దని కోరుకుంటున్నాను. నేను కోరుకున్నట్లే జరగకపోవచ్చు. నేను చెయ్యలేని స్థితే వస్తే ఏం చెయ్యాలో ఆరోజే చూసుకోవచ్చు.

"పసిపిల్లలుగా ఉన్నపుడు వారి మలమూత్రాలు ఎత్తడంలోకూడా ఆనందాన్ని అనుభవిస్తాం. అపుడు అందుకు ప్రతిగా వాళ్లేదో చెయ్యాలని ఆశించి చేస్తున్నామా? తల్లి కంటికి పిల్లలెపుడూ పసివాళ్లే."

"ఏమే ఒకనాడయినా వాళ్లజీతం తెచ్చి నీ చేతిలో పెట్టారా- వాళకింత చాకిరీ చేస్తున్నావు..."

"ఆ మాటే నాకు నచ్చదంటున్నాను. నేనేమయినా పనిమనిషిని అనుకుంటున్నారా?.. పని చేస్తున్నాను కనక, నా చేతిలో డబ్బు పెట్టాలి అనుకోడానికి. వాళ్లనుండి ప్రతిఫలాన్ని ఆశించడం అసహజంగా ఉంది..."

ఆవిడ మాటలకి నా మనసు ఆర్ద్రమైంది.

"మీ మనసెంతో ఉన్నతమైంది. ఇంకా మీ లాంటివాళ్లు ఉండడం వల్లనే, లోకంలో ఈ మాత్రమయినా శాంతి కనబడుతోంది" అన్నాను.

"నువ్వు నన్ను పొగడవలసిందేముందమ్మా? నా పిల్లలని నేను చూసుకోవడం నా కనీస ధర్మం. నేనేమీ దేశసేవ చేయ్యడంలేదే?..."

"ఈ వయసులో ఇంత కష్టపడడం..."

"మదర్‌థెరిసా ఎనభై ఏళ్ల వయసులోకూడా ఊరూరా తిరిగి మురికి వాడలకి వెళ్లి తనకేమీ సంబంధం లేనివారికి సేవలు చేసింది. నా వయసింకా అరవయ్యే. నేను చేతనయినంతవరకూ, ఇంటిపనులు చేసుకుంటున్నానే తప్ప ఆవిడలా దీన జనోద్ధరణ చేయడం లేదే... పశువులు కూడా కన్నపిల్లల్ని చూసుకుంటాయి. బుద్ధి, విచక్షణాజ్ఞానం ఉన్న మనునషులం మనం మన ధర్మాన్ని విసర్జించచ్చా..."

"ఇపుడీ చర్చతో నీ కాలాన్ని వృథా చెయ్యను. వైద్యో నారాయణో హరిః అన్నారు- ప్రస్తుతం నువ్వే నాకు ప్రత్యక్ష దైవానివి. నేను నా కర్తవ్యం నిర్వహించుకుందుకి నాకు సాయపడాలి. ఎంత పవర్‌ఫుల్ మందు ఇచ్చయినా, నేను త్వరగా లేచి తిరిగేలా చూడు."

మదర్ థెరిసాలు చేసే సేవకి గుర్తింపు ఉంది...

వారికి నోబెల్ బహుమతులున్నాయి...

ఈ తల్లికి ఏ గుర్తింపూ లేదే...!

గుర్తింపు కోరకుండా, గుర్తింపు లేకుండా పని చేసే ఈ తల్లి కార్యదీక్షముందు ఏ సంఘసేవలూ సాటిరావు.

ఈ తల్లులే దేశాభివృద్ధికి నిజమైన మూలస్తంభాలు- అనుకుని మనసులోనే ఆవిడకి పాదాభివందనం చేసుకుని, ఆర్ద్రనయనాలతో ఆ కర్మయోగికి సహకరించే ప్రయత్నంలో పడ్డాను.. ■

## స్నానం

ఆఫీసు అయిపోయాక బయటకొచ్చారు శివ, శర్మ, శాస్త్రి. వర్షం మొదలైంది.

శర్మ: నాదగ్గర గొడుగు ఉంది. మీ ఇద్దరిసంగతి ఏంటి?

శివ: నాకు బట్టతలగదా...నాకేం ఫర్వాలేదు. శాస్త్రీ! నువ్వు ఎలా ఇంటికెళ్తావ్?

శాస్త్రి: నాకూ ఫర్వాలేదు...ఉదయం నేను స్నానం చేసిరాలేకదా?!

-తరిగొప్పుల వి.ఎల్.ఎన్. మూర్తి,
హైదరాబాదు